ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబరు, 2025
5
శ్రీకాకుళం



విద్యార్థులకు నీట్ ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నీట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయకర్త యశోదలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఇంటర్మీడియట్ చదివి, నీట్ పరీక్షకు హాజరైన వారు, లాంగ్ టర్మ్ కోచింగ్ కావాలనుకునే విద్యార్థులు (2023-24, 2024-25) ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలతో అంబేద్కర్ స్టడీ సర్కిల్, విజయవాడలోకోచింగ్ క్లాసులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అంబేద్కర్ స్టడీ సర్కిల్ విజయవాడ ఫోన్ నంబరు 7569226400, శ్రీకాకుళం జిల్లా డిసిఒ ఫోన్ నంబర్లు 9441267323, 9701736862, 8978361642 సంప్రదించాలని సూచించారు.

మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తాం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాలో గిరిజన గ్రామాలకు అనుకూలంగా ఉండేలా మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలో సుమారు రూ.8 కోట్లతో నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.2.15 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సంభవించిన మొంథా తుపాను కారణంగా నష్టపోయిన పంటకు అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని అన్నారు. ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పంట నష్టం వివరాలను నమోదును చేపడతారని



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద, రాష్ట్ర మంత్రులు

తెలిపారు. అవసరమైతే మరికొంత సమయం తీసుకొని పంట నష్ట సమగ్ర సర్వేను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. పాతపట్నం నియోజవర్గానికి రూ.270 కోట్లతో ఏడాదిలోగా గ్రామాలకు శుద్ధ జలాలు అందించే విధంగా ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు ఈ నెలలోనే రైతుల ఖాతాల్లో రూ.7 వేల జమ చేయనున్నామని వెల్లడించారు. పాతపట్నం నియోజకవర్గం వెనుకబాటును పారదోవల్లి విధంగా ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయనున్నామని అన్నారు. ప్రతి మారుమూల గ్రామాలకూ అవసరమైన చోట్ల రహదాల నిర్మాణాలను చేపట్టి అభివృద్ధి చేయనున్నామని అన్నారు.

రూ.10.15 కోట్లతో అభివృద్ధి పనులు

మెళియాపుట్టి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో అదనపు సిబ్బంది నివాసగృహాల నిర్మాణానికి రూ.360.00 లక్షల నిధులు వ్యయం, పెద్దమడిలో జిటిడబ్ల్యుఎహెచ్ఎస్ బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రూ.434.87 లక్షలు నిధులు వ్యయంతో శంకుస్థాపన చేశారు. చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.192.21 లక్షల వ్యయంతో నిర్మించిన కెజిబివి టైప్-4 బాలికల హాస్టల్ భవనాన్ని, రూ.23.10 లక్షల నిధుల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా సహాయ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్, వంశధార ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవీంద్ర కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ , టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, మండల కో-ఆపరేటివ్ చైర్మన్ సలాన మోహనరావు, ఎఎంసి చైర్మన్ బైరి సింగి దినకర్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు పి.రమాదేవి, డివిఆర్‌ఎం.రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఆశాలత, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, విద్యుత్‌శాఖ అధికారులు ప్రసాదరావు, ప్రిన్సిపాల్ అను పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

- రైతు, కౌలురైతు సంఘం, వైసిపి నాయకుల వినతి
- 'మీకోసం'కు 92 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మొంథా తుపానుకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పత్తి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం'లో వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలు కొనుగోలు చేయాలని, కౌలురైతులకు పంట నష్టపరిహారం, పంటల బీమా, పెట్టుబడి సహాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందించాలని కోరారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర చట్టం తేవాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ ఆధ్వర్యంలోని బృందం ఫిర్యాదు చేసింది. క్షేత్రస్థాయిలో జిల్లా యూనిట్‌గా నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

నగర నీటి ముంపు సమస్యను పరిష్కరించాలి

నగర నీటిముంపు సమస్యపై పౌర సంక్షేమ వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఎస్.వెంకటరావు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలకు పాడైపోయిన రోడ్లను తక్షణం మరమ్మతులు చేయించాలని, నీటిలో నిల్వ ఉండే కాలనీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, మురుగునీటి నిల్వలు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వత భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అరసవల్లి జంక్షన్ నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు, కౌలురైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల మండలంలో కొత్తపేట, ముద్దాడ, సెగిడిపేట ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా పాడయ్యాయని, రోడ్ల మరమ్మతులు చేయాలని వైసిపి నాయకుడు బెండు రామారావు, బొడ్డేపల్లి సుధాకరరావు ఫిర్యాదు చేశారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషన్ కోర్సు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేశామని, 50 మంది విద్యార్థులకు అపెంటిస్ సౌకర్యం కల్పించాలని కోరారు. పొందూరు మండలంలో లైదాం వద్ద రెల్లిగడ్డపై వంతెన నిర్మించాలని, రెడ్డిపేటలో విద్యుత్ లైన్లు, సరఫరా సమస్య పరిష్కరించాలని సామాజిక కార్యకర్త కృష్ణారావు ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి నందగిరిపేట పంట కాలువపై అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని పాతిన వెంకటరమణ ఫిర్యాదు చేశారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, వికలాంగులకు బెడ్ రెస్ట్ పింఛన్లు వాటికోసం దరఖాస్తులు వచ్చాయి. 'మీకోసం'కు మొత్తం 92 వినతులు వచ్చాయి. అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి ఉన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే గొండు శంకర్
- రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

క్రీడల్లో మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యాన అండర్-19 బాలబాలికల క్రికెట్ టోర్నమెంట్ నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానాల్లో ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈ పోటీలను నిర్వహిస్తోంది. మొదటి మూడు రోజులు (3 నుంచి 5వ తేదీవరకు) బాలురకు, ఆ తర్వాత మూడు రోజులు (నవంబర్ 6 నుంచి 8) బాలికలకు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. పోటీల ప్రారంభానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే, అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. కోడి రామ్మూర్తి స్టేడియం పనులను త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులందరికీ అందుబాటులోకి తెస్తామని హామీనిచ్చారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా అధ్యక్షులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బి.వి రమణ, పిఇటి సంఘ నాయకులు ఎం.వి రమణ, పి.తవిటయ్య, ఎం.తిరుపతిరావు, ఎం.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఏవియేషన్ కేంద్రం

- పనులు సకాలంలో పూర్తి చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. మహిళా సాధికారతను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేస్తున్న ఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సివిల్ ఏవియేషన్ సహకారంతో, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇది కేవలం



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మహిళలకు మాత్రమే ఉద్దేశించిన ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రమన్నారు. ఇక్కడ రెండు నెలల పాటు ఎయిర్‌లైన్స్ టికెటింగ్ అండ్ రిజర్వేషన్, ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ ఆపరేషన్స్ (పాసింజర్ అండ్ బ్యాగేజ్ హ్యాండ్లింగ్) వంటి కీలక కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణా కేంద్రంలో ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున, ఒకే విడతలో 60 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా ఏడాది కాలంలో 240 మందికి నైపుణ్య శిక్షణ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేంద్రానికి అవసరమైన సాంకేతికపం ైన పరికరాలు, ప్రయోగశాల సామగ్రిని సిఎస్ఆర్ నిధుల నుంచి సంబంధిత సంస్థ సమకూరుస్తుం దని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. శిక్షణ కేంద్రం ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, జిల్లా మహిళలు విమానయాన రంగంలో ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కేంద్రం ఉపకరిస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు మెరుగైన ఉపాధి లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం..

రైతుల ఆర్థికాభివృద్ధికి మార్గం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్రకృతి వ్యవసాయం రైతుల ఆర్థికాభివృద్ధి, ఆరోగ్య రక్షణ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే అత్యంత స్థిరమైన మార్గమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ప్రకృతి సాగు ఒక అద్భుతమైన అవకాశమన్నారు. స్థానిక టిటిడిసి వద్ద ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ ప్రాజెక్టు ఆధ్వర్యాన ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని జిల్లాలోని ప్రతి రైతు సాగు చేయడానికి వీలుగా అధికారులు, శిక్షణ పొందిన సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీనిచ్చారు. రైతులకు అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం వారి ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయాల కల్పన విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రాజెక్టు అధికారి పి.సత్యనారాయణ మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఫర్ నేచురల్ ఫార్మింగ్ లక్ష్యాలు, జిల్లాలో అమలు చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్‌కు, హాజరైన శిక్షణా బృందానికి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, క్షేత్రస్థాయిలో జీవామృతం, బీజామృతం తయారీ, అమలు విధానాలపై సమగ్రంగా చర్చించారు. రైతులు సంప్రదాయ పద్ధతుల వైపు మళ్లాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో శిక్షణా రిసోర్స్‌పర్సన్లు, నేచరల్ ఫార్మింగ్ సిబ్బంది, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

7న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నరసన్నపేట నియోజకవర్గంలోని చల్లవానిపేటలోని వంశధార డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 7న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, ఎక్స్ గ్లోబల్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, టాటా క్యాపిటల్, కియా మోటార్స్, అపోలో టైర్స్, యొకహామా టైర్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో సహా 11 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 500 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, శ్రీసిటీ నెల్లూరు, కడప, పెనుగొండ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రిఫరెన్స్ నంబరు, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కలిసి ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి రావాలని తెలిపారు. వివరాలకు 9949900672, 6301045132 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

17న కలెక్టరేట్ వద్ద మహాధర్నా

ఎండిఎం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి



మాట్లాడుతున్న అల్లు మహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 5 నుంచి 13 వరకు మండల కేంద్రాల్లో, 17న కలక్టరేట్ మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర తెలిపారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో కె.సుశీల అధ్యక్షతన సోమవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు కట్టబెట్టేందుకు నిస్సిగ్గుగా పనిచేయడాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో గత 20 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దు చేసి ఒకేచోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాన్ని విరమించాలన్నారు. వేల మంది విద్యార్థులకు ఒకేచోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. గార, ఆముదాలవలస మండలాల్లో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి అనేక విమర్శలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు. ప్రైవేటీకరణ విధానాన్ని ఆపకపోతే మధ్యాహ్న వంట నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.ప్రవీణ, కె.ఉమ, టి.రామానుజమ్మ, బి.తులసమ్మ, ఎ.లక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.



పసికందు మృతదేహం

మంటగలిసిన మానవత్వం

మురుగు కాలువలో పసికందు మృతదేహం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ


అమ్మతనం చిన్నబోయింది. మానవత్వం మంటగలిసింది. తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు మురుగు కాలువలో విగతజీవిగా తేలియాడింది. ఈ అమానవీయ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. ఈ హృదయ విదారక ఘటన శ్రీకాకుళం నగరంలోని అరసవల్లిలో సోమవారం చోటుచేసుకుంది. అరసవల్లిలోని డ్రైనేజీలో పసికందు మృతహేదం ఉన్నట్లు పోలీసులకు స్థానికుల నుంచి సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలువలో నుంచి పసికందు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శిశువు మృతదేహాన్ని ఎవరైనా ఇక్కడకు తెచ్చి పడేశారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. నిజానిజాలు తేల్చేందుకు పరిసర ప్రాంతాల్లోని సిసి టివి పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

సోషల్ మీడియాను మంచికే ఉపయోగించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - రణస్థలం

విద్యార్థులు సోషల్ మీడియాను వివేకంతో ఉపయోగించాలని, భవిష్యత్‌కు ఉపయోగపడే విషయాలను మాత్రమే గ్రహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు అన్నారు. మండలంలోని కొండములగాంలో ఆదర్శ పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కల్పించిన మౌలిక సదుపాయాలు, భోజన, వసతి సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు పారిశుధ్యం ఎంత ముఖ్యమో వివరించిన ఆయన, ఆహారం అందించే విషయంలో నాణ్యత విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్త పడాలని అధికారులను ఆదేశించారు. నల్సా ద్వారా బాలలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు గురించి వివరించి, వారికి అవసరమైన న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె.రమణ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న హరిబాబు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్లు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

2025 డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో ఐదురోజుల పాటు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పైడిభీమవరం వద్ద డా.రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమ వద్ద సోమవారం సిఐటియు అఖిలభారత మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మికవర్గ పోరాటాలను నిర్మించేందుకు 2025 డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయన్నారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు సేవ చేయమని అధికారం ఇస్తే పెట్టుబడిదారులకు సేవచేస్తుందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డా. రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సత్యన్నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తుపాను నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మొంథా తుపాను కారణంగా రైతులు నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం మండల మహాసభ డిమాండ్ చేసింది. మండలంలోని బెండిలో కె.బాలాజీరావు అధ్యక్షతన ఎపి రైతు సంఘం మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తమ్మినాన భాస్కరరావు మాట్లాడుతూ వంశధార కాలువలను ఆధునీకరించి శివారు భూములకు నీరు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అనుసరించి అన్ని పంటలకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.అన్నదాత సుఖీభవ సహాయం కౌలు రైతులందరికీ అందించాలన్నారు. నీట మునిగిన వరి పంటకు ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. రంగు మారిన తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేస్తున్న జలవంతపు భూసేకరణ విరమించాలన్నారు. ఈ ప్రాంతంలో జీడి, కొబ్బరి ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె.బాలాజీరావు, కార్యదర్శులుగా తమ్మినాన భాస్కరరావు, టి.ఢిల్లీరావు, ఉపాధ్యక్షునిగా లక్ష్మీనారాయణ, నీలాచలం, మరో 9 మందితో మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టి.లక్ష్మి, తారకేశ్వరరావు, రవణమ్మ కోదండ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బస్సులు ఆపాలని విద్యార్థుల ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- బూర్జ

తమ గ్రామ కూడలి వద్ద బస్సులు ఆపడం లేదని సోమవారం విద్యార్థులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మండలంలోని లక్కుపురం గ్రామ కూడలి వద్ద ఆర్‌టిసి బస్సులు ఆపకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ జంక్షన్ వద్ద చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారని, అటు పాలకొండ ఇటు శ్రీకాకుళం పాఠశాలలకు, కళాశాలలకు అనునిత్యం వెళ్తుంటారని తెలిపారు. అయితే బస్సులు ఇక్కడ ఆపకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇక్కడ రిక్వెస్ట్ స్టాప్ కావాలని పాలకొండ, శ్రీకాకుళం ఆర్‌టిసి డిపో అధికారులకు పలుమార్లు వినతులు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు లక్కుపురం కూడలిలో రిక్వెస్ట్ స్టాప్ ఇవ్వాలని, అన్ని బస్సులు నిలిపేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపారు. సుమారు రెండు గంటల కాలం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులు నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపిపి కర్నెన దీప విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇదివరకు పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చామన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. విద్యార్థుల నిరసనతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న బూర్జ ఎస్‌ఐ ప్రవల్లిక సిబ్బందితో చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా సమస్యల పరిష్కారం ప్రాధాన్యతా అంశమని, ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను సత్వరంగా పరిష్కరించేందుకు అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో స్వయంగా ప్రజల నుంచి 52 అర్జీలు స్వీకరించారు. ప్రజల వినతులను పరిశీలించిన ఎస్‌పి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడి, తక్షణమే సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలపై పోలీసులు చొరవ చూపి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదును స్వీకరించి, న్యాయం జరిగేలా చర్యలు పట్టాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఇళ్ల స్థలాలు అప్పగించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీలో 2020లో చింతలగర రెవెన్యూ పరిధిలోని పట్టణానికి చెందిన 600 మందికి ఇళ్లు లేని నిరుపేద శ్రామికులకు ఉన్నారని, వీరికి ఇళ్ల స్థలాలు ఇస్తామని సిఎం చంద్రబాబు హామీనిచ్చారని, వారికి ఇళ్ల స్థలాలు చూపించాలని సిపిఎం నాయకులు నంబూరు షన్ముఖరావు, కొల్లి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉండదని అధికారులు చెబుతున్నారని, ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తాం, దరఖాస్తు చేసుకోవాలని చెబుతుందని అన్నారు. అర్హులైన పేదలు మరలా దరఖాస్తులు పెట్టుకుంటే మీకు ఇదివరకే స్థలం పట్టా ఇచ్చేశారని, మీ ఆధార్ నంబరు కొడితే కంప్యూటర్ చూపిస్తుందని చెబుతున్నారని అన్నారు. పూర్తిస్తాయిలో దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు, తెంబ సరస్వతి, పి.లత, పి.దుర్గాభవాని, జి.కళ్యాణి, ఎస్.అరుణ, డి.అమ్మోజి, వాణి పాల్గొన్నారు.

విప్ పరామర్శ



చెక్కును అందిస్తున్న విప్ అశోక్

కవిటి: కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఒడిశా రాష్ట్రం గుడ్డిపద్రకు చెందిన రంగాల రూప కుటుంబాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదివారం రాత్రి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును రూప తండ్రి రంగాల ఢిల్లేసుకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పరామర్శించి ధైర్యం చెప్పి, ప్రభుత్వం పూర్తి సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చీకటిపేట ఎమ్మెల్యే సతీమణి మిన్ను సంత్ర, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు, తహశీల్దార్ మురళీమోహన్ పట్నాయక్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందర్శకులు అప్రమత్తం

సోంపేట : కార్తీకమాసం ఆదివారాల్లో సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులు పోలీసు బందోబస్తు ఉన్న ప్రదేశంలో వారి సూచనలను అనుసరించి తమవైపు నుంచి కూడా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని వ్యక్తి గత భద్రత వహిస్తూ, ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలని మెరైన సిఐ రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే కార్తీక మాసం సోమవారాల్లో ఆలయాల వద్ద కూడా యాత్రికులు క్యూలైన్ తప్పనిసరిగా పాటించాలన్నారు. బీచ్‌ల వద్ద తగినంత మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల సంభవించిన మొంథా తుపాను ప్రభావంతో కొన్ని బీచ్‌ల్లో అక్కడక్కడ గుంతలు ఏర్పడి ప్రమాదవశాత్తు మునిగిపోయే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ సంతాపం

ఆమదాలవలస: ఇటీవల మృతి చెందిన న్యాయవాదులు చౌదరి లక్ష్మణరావు, గొర్లె లక్ష్మణరావులకు బార్ అసోసియేషన్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సోమవారం జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నెపు సత్యనారాయణ, బగాది గోవిందరాజులు ఆధ్వర్యంలో న్యాయవాదులు సమావేశమై ఒక నిమిషం మౌనం పాటించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అవసరం

నరసన్నపేట: పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ పి.లత సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కాలేజీలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన స్కిల్ హబ్‌కు సంబంధించిన డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అన్నాజీరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్ఞానభారతిలో వ్యాసరచన పోటీలు

ఇచ్ఛాపురం : ఈనెల 9న లీగల్ సర్వీస్ డే సందర్భంగా స్థానిక మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యాన జ్ఞాన భారతి విద్యా సంస్థలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రాథమిక హక్కులు, విధులు, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 250 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సెక్రటరీ, సిఇఒ జోహార్‌ఖాన్, ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండ, హెచ్‌ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అందుకోవాలి

పలాస: సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మీ కర్తవ్యాన్ని నిర్వహించి లక్ష్యాన్ని అందుకోవాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పలాస శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.నటరాజ్ విద్యార్థులకు సూచించారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో భాగంగానే మనకు ఎదురయ్యే అవినీతి నిర్మూలన కూడా బాధ్యతగా భావించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, పవర్ గ్రిడ్ పలాసశాఖ చీఫ్ మేనేజర్ వివిఎన్‌ఆర్‌కెఎన్ శెట్టి, జూనియర్ ఇంజినీర్లు కె.రఘుపతిరావు, ఇ.అప్పల నాయుడు, అధ్యాపకులు కొండల మధుబాబు, బి.ప్రసాదరావు, ఎస్.యుగంధర్, టి. రమేష్ పాల్గొన్నారు.

విడిఎ పాయింట్లు పెంచాలి



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడిఎ పాయింట్లు పెంపుదల చేసి కార్మికశాఖ వెంటనే గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. అక్టోబర్ 31న కార్మికశాఖ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఒక్క విడిఎ పాయింట్ కూడా పెంచకుండా కార్మికులకు నష్టం చేసిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడిఎ పాయింట్లు పెంచి వెంటనే విడుదల చేయాలని కోరుతూ అరిణాం అక్కివలస వద్ద గల ఎన్‌ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలకు సంబంధించి కరువు భత్యాన్ని ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా విడుదల చేసిన గజిట్ నోటిఫికేషన్‌లో సున్నాగా ప్రకటించిందని, 'ధరలు ఆకాశానికి – జీతాలు పాతాళానికి' అన్నట్లుగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 72 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేసే 50 లక్షల మందికి చట్టప్రకారం ఈ కరువుభత్యం వర్తిస్తుందన్నారు. ఇప్పటికి మూడుసార్లు పెరగాల్సిన జీతం కార్మికులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలు, వేల కోట్లు ఆదాయాలు వచ్చే ఆక్వా, సిమెంట్, ఫార్మా, గనులు, మాల్స్, కార్మికులకు డిఎ ఇవ్వలేవా అని వారు ప్రశ్నించారు. కార్మికులంతా కరువుభత్యం సాధించడానికై పోరాటానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ధరలు పెరుగుదలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కరువుభత్యం (విడిఎ) పెంచకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, కేదారేశ్వరరావు, బెవర శ్రీను, ఎల్. రామప్పడు, మాన్యం రమణ, ఎల్.చిరంజీవి, ఎస్.పరశురాం, పి.నాగరాజు, పి.సత్యనారాయణ, ఎం.తవుడు, జె.నూకరాజు, వై.గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి పిఎసిఎస్ ఛైర్మన్ వెలమల విజయలక్ష్మి, సభ్యులు సాసుమంతు ఆనందరావు, సకాలభక్తులు రాంకుమార్‌లు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోమవారం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. అలాగే స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నూతన ఫించన్లు మంజూరు, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి.



కోటబొమ్మాళి : పిఎసిఎస్ కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న మంత్రులు

నందిగాం : మండలంలోని కాపుతెంబూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా పి.చంద్రశేఖరరావు, సభ్యులుగా బిగిరి అనంతగిరి బాధ్యతలు చేపట్టారు. సొసైటీ ఎదుగుదల కృషి చేస్తామని రైతులకు చేదోడుగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ దాసు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో నాణ్యమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆధునిక పద్ధతులతో నాణ్యమైన ఉత్పత్తులను రైతులు సాధించాలని హార్టికల్చరల్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీనివాసాచార్యుల పేటలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చైతన్య రైతు సంఘం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మామిడి పంటల యాజమాన్యం, పద్ధతులు, ఇతర ఉద్యానవన పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, పంటల ఉత్పత్తి, పెంపునకు అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై నిపుణులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బూర్జ మండలంలోని పెద్దపేట హార్టీ కల్చరల్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మామిడి పంటలో వ్యాధుల నియంత్రణ, ఫలోత్పత్తి పెంపు కోసం సమయాను కూలంగా ఎరువులు, నీటిపారుదల పద్ధతులు పాటించాలని తెలిపారు. రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఉద్యానవన శాఖ అధికారి అయింతీ, హెచ్‌ఇఒ తిరుపతిరావు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ హరి చైతన్య, ఎఫ్‌పిఒ ప్రతినిధి ధర్మారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్

జాతీయ సమైక్యత శిబిరానికి బిఆర్ఎయు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విసి రజని

ఎచ్చెర్ల: హర్యానాలోని రోహతక్ పట్టణానికి చెందిన మహర్షి దయానంద్ యూనివర్శిటీలో జరగనున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనేందుకు డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ విద్యార్థులు సోమవారం పయనమయ్యారు. వివిధ రాష్ట్రాల్లోని సంస్కృతి, కళలు, క్రీడలు, అభిరుచులు వంటివి, దేశ ఐక్యతలో యువతను భాగస్వామ్యం చేయడంలో భాగంగా జాతీయస్థాయిలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 4 నుంచి ఏడురోజుల పాటు శిబిరం జరగనుంది. ఈ శిబిరంలో పాల్గొనేందుకు డా.బిఆర్ఎయు నుంచి పది మంది సభ్యులు ఎంపికయ్యారు. క్యాంపస్‌లోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ఎన్.త్రివేణి, కె.పవన్, జి.రవి, జి.శ్రావణిలు, ఇసిఇ విభాగానికి చెందిన ఎస్.సాయి ప్రదీప్, ఎస్.భార్గవి, ఇఇఇ విభాగానికి చెందిన జి.చంద్రశేఖర్, పి.అభిషేక్, కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన ఎస్. అంకితతో పాటు పలాస – ఎస్.బి.ఎస్.వై.ఎం.డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.పవిత్రలతో కూడిన విద్యార్థుల బృందం ఈ శిబిరంలో పాల్గొనున్నారు. వర్శిటీ ఎన్.ఎస్.ఎస్ పిఒ డా. కె.కరుణానిధి ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులకు వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, ఎన్.ఎస్.ఎస్. కో– ఆర్డినేటర్ డా. డి.వనజ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

పోలాకి: మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని రాజారాంపురం, కొత్తరేవు, గుప్పిడిపేట గ్రామాల్లో తుపాను ప్రభావిత ప్రాంతమైన 374 మంది మత్స్యకారులకు ఉచితంగా నిత్యావసర సరుకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మత్స్యకారులకు సబ్సిడీ వలలు, చేపల వేటకు ఇంజిన్ బోట్లు, అందించామని గుర్తు చేశారు. గ్రామంలో రహదారి నిర్మాణానికి రూ.43 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛను ఇచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పల నాయుడు, బైరి భాస్కరరావు, మండల ప్రత్యేక అధికారి ఎల్.వి.మధు పాల్గొన్నారు.



సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి



ప్రారంభిస్తున్న మంత్రులు

అన్న క్యాంటీన్ ప్రారంభం


కోటబొమ్మాళి: పేదల కడుపు కొడుతూ అన్న క్యాంటీన్లను గత వైసిపి ప్రభుత్వం మూసివేసిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలో సోమవారం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి సోమవారం అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీగా అధికారంలో లేకపోయినా స్థానిక ఎమ్మెల్యేలు, దాతల సహకారంతో పేదలకు అన్నం పెట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ అన్న క్యాంటీన్లు ప్రారంభించారని అన్నారు. ముఖశీ కోటబొమ్మాళి మండల కేంద్రంలో రూ.39 లక్షలు జిల్లా సహకార బ్యాంకు నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, రమేష్, పూజారి శైలజ, బాగాది శేషగిరి, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉద్యమంలా సంతకాల సేకరణ

ప్రజాశక్తి- నరసన్నపేట

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమంలా చేపడతామని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. స్థానిక వైఎస్ఆర్ కూడలి వద్ద పిపిపికి వ్యతిరేకంగా సోమవారం సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు వైద్య విద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం తమ అనుయాయులకు అప్పగించడానికి ఈ విధానం అవలంబిస్తుందని, ఈ విధానానికి తామంత వ్యతిరేకమని స్పష్టం చేశారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోరాడ చంద్ర భూషణ గుప్తా, పొందర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజాపు అప్పన్న, వైసిపి మండల అధ్యక్షులు లుకలాపు రవికుమార్, స్థానిక సర్పంచ్ బూరెల్ల శంకరరావు పాల్గొన్నారు.

కొత్తూరు: మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అధ్యక్షతన కడుంలో సోమవారం రచ్చబండ నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ప్రభుత్వం అనాలోచన నిర్ణయాలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రామారావు, ఎఎంసి మాజీ ఛైర్‌పర్సన్ సరిపల్లి నిరోష, ఎంపిటిసి సారిపల్లి ప్రసాదరావు, ఎఎంసి మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, వైసిపి నాయకులు అగతముడి నాగేశ్వరరావు, తిరుపతిరావు, జి.పోలయ్య పాల్గొన్నారు.



నరసన్నపేట : సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

ఇద్దరికి జైలు శిక్ష

ప్రజాశక్తి- పలాస

పలాస జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో రెండు కేసుల్లో ముద్దాయిలకు జైలు శిక్ష పడిందని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ వెల్లడించారు. కాశీబుగ్గ హెడ్ కానిస్టేబుల్ బి.నివాసరావు విధులకు ఆటంకం కలిగించి దాడి చేసిన కేసులో బోసి రాంబాబుకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ... పలాస కోర్టు జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి సోమవారం తీర్పునిచ్చారని అన్నారు. 2022 మార్చి నెలలో కాశీబుగ్గ పాత జాతీయ రహదారి వాసవి హోటల్ ఎదురుగా విధులు నిర్వహిస్తుండగా రాంబాబుతోపాటు మరొకరు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి దాడి చేసిన కేసులో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సిఐ శంకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. అలాగే సూదికొండ కాలనీకి చెందిన దాసరి దానయ్య, రాజారావు, పిట్ట షణ్ముఖరావులు కొట్లాటకేసులో ఒక్కొక్కరికీ రూ.1500 జరిమానా లేదా మూడు నెలలు మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని అన్నారు. 2020 సెప్టెంబరు నెలలో పురుషోత్తపురానికి బండారు శ్రీనుపై జరిగిన దాడిపై అప్పటి ఎస్ఐ వై.మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని చెప్పారు. పై రెండు కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదనలు వినిపించారు. కేసులు రుజువు కావడంతో ముద్దాయిలకు జైలు శిక్ష పడిందన్నారు.



కుళాయిల పనులకు శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

తీరనున్న తాగునీటి సమస్య

పొందూరు: మండలంలోని రాపాక అంబేద్కర్ కాలనీవాసులకు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఎట్టకేలకు నెరవేరనుంది. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో ఇంటింటా తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు కూటమి నాయకులు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని చేశారు. సుమారు రూ.16 లక్షల నిధులతో తాగునీటి పైపులు వేసి కుళాయిల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఇప్పటికే కాలనీ సమీపంలో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టగా, అక్కడి నుంచి పైపుల ద్వారా ఇంటింటా కుళాయిలకు తాగునీటిని సరఫరా చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల తెలుగుయువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, నాయకులు కె.చిన్నం నాయుడు, కె.గొల్లయ్య, మనోహరరావు, చింత మహేష్, ప్రకాశకరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

అరసవల్లి: స్థానిక కష్ణాపార్కు కూడలిలో నివాసముంటున్న, నిస్సహాయ ఒంటరి మహిళ వైశ్యరాజు సంతోషికుమారి కుటుంబానికి, శ్రీకాకుళం స్టార్ బ్యూటీస్ సభ్యుల బృందం అండగా నిలిచింది. ఇటీవలే వైశ్యరాజు సంతోషి కుమారి భర్త వైశ్యరాజు కృష్ణంరాజు గుండెపోటుతో మరణించారని, గతంలో ఆమె భర్త ఒక వర్తకుని వద్ద దినసరి కూలీగా పనిచేసుకుంటూ కుటుంబ పోషణ కొనసాగించేవారని, ఇద్దరు చిన్న పిల్లలు ఊహ తెలియని స్థితిలో ఉన్నారని, కుటుంబానికి పెద్దదిక్కు లేకపోవటంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని కాస్మోటాలజిస్ట్ ప్రిస్కిల్ల గిరిరాజ్ సోమవారం తెలిపారు. సంతోషి స్నేహితురాలు శాంతి ద్వారా విషయం తెలుసుకుని, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు, రైస్ ప్యాకెట్‌తో పాటు కూరగాయలు అందించామన్నారు. రానున్న రోజుల్లో అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో శాంతి, రమాదేవి, కవిత, శారదా, శివతేజ, సావిత్రి, లావణ్య, శశికళ, సత్య మీనాక్షి, సంధ్య, నసీమ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రూ.ఐదు లక్షల చెక్కు అందజేత

రణస్థలం: కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసిన ఘనత టిడిపికే దక్కుతుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలం వేల్పురాయి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బాలి సింహాచలం ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయాన్ని గ్రామ నాయకులు ఎంపీకి తెలియజేయగా ఎంపీ పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లిరు. పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లెంక శ్యామ్, ఉమ్మడి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పిన్నింటి బానోజీ నాయుడు, సర్పంచ్ బాలి శ్రీను, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

ఇచ్ఛాపురం: కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల తొక్కిలాసటలో ఒడిశా రాష్ట్రం గూడభద్రకు చెందిన రంగాల రూప మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యామ్‌ప్రసాద రెడ్డిలు సోమవారం మృతురాలి తండ్రి ఢిల్లేష్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం కొంత ఆర్థికసాయం అందజేశారు. మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ అనపాన శ్రీరాం, పాత్రపరం బ్లాక్ సమితి ఛైర్మన్ యెదురు మోహనరావు, మద్ది బోజరాజు, ఎర్ర గోపాల్‌శెట్టి, పంది రఘుముని, గుజ్జు శేఖర్, సారంగా, రోకల ధర్మరాజు, చంద్రయ్య, రంగాల చంద్రయ్య, దిలీప్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం: యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు మాసోత్సవాలు సందర్భంగా రత్తకన్న, కెపి కాలనీ, బుడ్డపుపేట, మందపల్లి గ్రామాలకు చెందిన వంద మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసరాల సరుకులు ట్రస్టు ఛైర్మన్, న్యాయవాది రాంబాబు సోమవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రాంబాబు సేవలను ఆదర్శంగా తీసుకోని ఎన్నో సేవ సంఘాలు ఏర్పడ్డాయని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే ట్రస్టు ఆధ్వర్యాన 15సార్లు రక్త దానం చేసిన పాతిర్ల గిరిబాబుకు సన్మానించారు. అలాగే ట్రస్టుకు సేవలు అందిస్తున్న చిన్ని బైరి, పాతిన వెంకటరావు, ప్రేమ్ దోలాయి, కోరికాన ధర్మరాజులకు దేవేందర్‌రెడ్డి, రాంబాబులు దుశ్వాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సత్యసాయి ఎండి భానుతేజ, ఎఇ సుగ్గు హరీష్, ఎంపిటిసి కాళ్ల గోపి, వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కె.శ్రీను, పేరయ్య, పి.చంద్రశేఖర్, లోకేష్, అనిల్, తరనిరావు పాల్గొన్నారు.